వేధింపులపై అంగన్‌వాడీల నిరసన




దక్కిలి: తహసీల్దార్ కార్యాయలం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

దక్కిలి : అధికార పార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని, కొన్ని చోట్ల హెల్పర్లను బలవంతంగా రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని అంగన్‌వాడీ వర్కర్లు వాపోయారు. వారు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పెన్షన్, పీఎఫ్, ఐఎస్ఐ సౌకర్యాలు క ల్పించాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీలో అంగీకరించిన అంశాలకు జీవోలు విడుదల చేయాలన్నారు. అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలన్నారు. లేబర్ కోడ్, యాప్‌లను రద్దు చేయాలన్నారు. అనంతరం డీటీ ప్రసన్నకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నేతలు ప్రసన్న, వెంకటమ్మ, సుకన్య, రాజేశ్వరి, తులసి, ప్రసన్న, సుగుణ, రాఘమ్మ పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్ : అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉ ద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వర్కర్లు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, కనీస వేతనాలను రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు ఇవ్వాలన్నారు. అనంతరం డీటీకి వినతి పత్రం అందజేశారు. సీపీఎం సెంట్రల్ కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి సురేష్, డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులు, మణి, చంద్రయ్య, పుట్టా శంకరయ్య, గుర్రం రమణయ్య, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు ఇంద్రావతి, ప్రభావతి, జానకి, ఉషా తదితరులు పాల్గొన్నారు.




రాపూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

రాపూరులో..

రాపూరు: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. వారు బుధవారం రాపూరులోని అంగన్‌వాడీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటరత్నంకు వినతి పత్రం సమర్పించారు.

అధికార పార్టీ నాయకులు వేధిస్తున్నారు



డీటీకి వినతి పత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

బాలాయపల్లి(సైదాపురం) : అంగన్‌వాడీ హెల్పర్లను అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని అంగన్‌వాడీ వర్కర్లు వాపోయారు. వారు ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం మండల కార్యదర్శి స్వరూప రాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని అధికార పార్టీ నేతలు వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు వేతనాలు పెంచాలని కోరారు.

జీతాలు ఇవ్వాలని సమగ్ర శిక్ష సిబ్బంది వేడుకోలు



నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష సిబ్బంది

చిల్లకూరు : రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే చెల్లించాలని సమగ్ర శిక్ష సిబ్బంది కోరారు. వారు బుధవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర జేఏసీ కో కన్వీనర్ డాక్టర్ బొమ్మి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోయారు. ఇప్పటికీ జీతాలు ఇవ్వకపోవడంతో ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో జీతాలు నిలిపివేశారని, తర్వాత అసలు పట్టించుకోలేదని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె చేసిన 22 రోజులు వేతనాలను అందజేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని, దాన్ని కూడా చెల్లించాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు, మెసెంజర్లు, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

గర్భిణులు రక్త హీనతను అధిగమించాలి

చిల్లకూరు : గర్భిణులకు ప్రసవ సమయంలో రక్త హీనత లేకుండా చూస్తే పండంటి బిడ్డకు జన్మనివ్వవచ్చని ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీవో జ్యోతి కిరణ్ తెలిపారు. మండలంలోని తిప్పగుంటపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఇంటి వద్ద ఆకు కూరలు, పాలు, పండ్లు బాగా తినాలని వెల్లడించారు. మూడు సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డను తమకు సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలను భద్రంగా ఉంచుకోవాలి

చిల్లకూరు : ప్రభుత్వం విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలను భద్రంగా ఉంచుకునేలా రాష్ట్ర పాఠ్య పుస్తకాల డైరెక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి అన్ని రకాల పాఠ్య పుస్తకాలు అందజేశారా అని ప్రశ్నించారు. ఇంకా కొన్ని ఇవ్వాల్సి ఉందని చెప్పడంతో త్వరలో వాటిని అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో పాఠ్య పుస్తకాలను తమ చదువు పూర్తయిన తర్వాత మరొకరికి ఇచ్చేవారని తెలిపారు. మీరు కూడా అలా ఇవ్వాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠ్యంశాల్లో తప్పులను గుర్తించారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించి నాణ్యంగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సంపత్‌కుమార్, రవూఫ్, హెచ్‌ఎం సుధాకర్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందాయా

గూడూరు రూరల్ : అన్ని రకాల పాఠ్య పుస్తకాలు ప్రతి విద్యార్థికీ అందాయా అని పాఠ్య పుస్తకాల రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి విద్యా శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. పుస్తకాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, వాటిని మళ్లీ మరొకరికి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎంఈవో సనత్‌కుమార్, కాంచన, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పార్వతి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు



తడకండ్రిగ వద్ద పరిశీలిస్తున్న హైవే అధికారులు

తడ: మండలంలోని పూడి గ్రామం నుంచి కరిపేటి కాలువ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా 7 మీటర్ల వెడల్పు ఉండేలా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తామని జాతీయ రహదారి విస్తరణ అధికారులు తెలిపారు. నేషనల్ హైవే సైట్ ఇంజినీర్లు రోహిత్, ఆర్‌వీ మహేష్, టోల్ ప్లాజా మేనేజర్ నాగరాజు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ సర్వీసు రోడ్డు చేపడితే తాగునీటి పైపులైన్లతోపాటు ఇతరత్రా అంతర్గత సేవలకు కలిగే ఇబ్బందులను గురించి తడకండ్రిగ పంచాయతీ అధికారులతో చర్చించారు. శ్రీసిటీ కూడలి వద్ద అండర్ పాస్ వంతెనతోపాటు శ్రీకాళహస్తి నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలు జాతీయ రహదారిపై సులువుగా మలుపు తిరిగేందుకు అనుకూలమైన ప్రదేశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు మేనేజర్ నాగరాజు తెలిపారు. హైవే సిబ్బందితోపాటు ఎంపీపీ కే రఘురెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు శశికుమార్, తడకండ్రిగ పంచాయతీ ఉపాధ్యక్షుడు ఆఫ్రిది, విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏఈ భవాని, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియేల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

బాలాయపల్లి(సైదాపురం) : బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో ప్రదీప్ కుమార్ తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బుధవారం బాలాయపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదల జీవితాలను మెరుగుపడతాయన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఉచితంగా యునిఫారం, పుస్తకాలు ఇస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం పౌష్టికాహారం అందజేస్తున్నట్టు తెలిపారు. పిల్లలతో పనులుచేయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఎస్ఐ మహబూబ్ సుభాన్ పాల్గొన్నారు.

సింటెక్స్ వాటర్ ట్యాంక్ వితరణ



ట్యాంకును అందజేస్తున్న జిందాల్ ప్రతినిధులు

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నం గ్రామానికి నీటి అవసరాలు తీర్చే క్రమంలో సింటెక్స్ వాటర్ ట్యాంకును బుధవారం జిందాల్ కంపెనీ ప్రతినిధులు వితరణ చేశారు. తమ్మినపట్నంలో వినియోగిస్తున్న సింటెక్స్ ట్యాంక్ పగిలిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు జిందాల్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. వారు సీఎస్ఆర్ నిధుల కింద సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ కే శ్రీనివాసరావు, హెచ్ఆర్ హెడ్ విల్సన్, సీఎస్ఆర్ జోబెన్, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో వైద్య సేవలు

దొరవారిసత్రం : తొగరాముడి పీహెచ్‌సీ పరిధిలోని కల్లూరులో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు టీకాలు వేశారు. వైద్యాధికారి తరుణ్, వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, రాజకుమారి, వరలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

దక్కిలి: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఏపీవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన బుధవారం మోపూరు వెలంపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు రోజుకు నాలుగు గంటలు పని చేయాలన్నారు. కొలతల ప్రకారం పని చేస్తేనే గిట్టుబాటు కూలి రూ.300 లభిస్తుందన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని దినాలు కల్పిస్తామన్నారు. గ్రామంలో అవసరమైన పనులు గుర్తించి చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు మస్టర్లను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మధ్యాహ్నం ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈసీ దామోదర్‌రాజు, టీఏలు షఫీ, గిరి, సరిత, బీఎఫ్‌టీ శివయ్య పాల్గొన్నారు.

రేషన్ షాపు సీజ్

పెళ్లకూరు: మండలంలోని రావులపాడు రేషన్‌షాపును బుధవారం సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్య సీజ్ చేశారు. గ్రామానికి చెందిన పరుశురామ్ రేషన్ షాప్ బాధ్యతలు నిర్వర్తించకుండా తల్లిదండ్రులకు అప్పగించాడు. దీంతో ప్రతినెలా సరుకులను సక్రమంగా ఇవ్వడం లేదని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ చేపట్టడంతో 1,065 కేజీల రేషన్ బియ్యం తక్కువగా ఉండంతో పాటు రేషన్ డీలర్ స్థానికంగా లేనట్టు గుర్తించారు. ఈ క్రమంలో రేషన్ షాపును సీజ్ చేసి సరుకుల పంపిణీ బాధ్యతను స్థానిక వీఆర్వో కళ్యాణికి అప్పగించినట్లు డీటీ తెలిపారు.

బ్రాహ్మణ వీధిలోకి గరిడీ వీధి సచివాలయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పాత బస్టాండు సమీపంలో పాత అన్నా క్యాంటిన్‌లో భవనంలో ఉన్న గరిడీ వీధి సచివాలయాన్ని బ్రాహ్మణవీధిలోకి మార్చినట్లు కమిషనర్ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మున్సిపల్ డీఈ శ్రీనివాసులు, ఏఈ చంద్రమోహన్‌తో కలసి అన్నా క్యాంటిన్ భవనాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు పాత బస్టాండు వద్ద అన్నా క్యాంటిన్‌ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. బ్రాహ్మణ వీధిలోని సచివాలయంలో ఎప్పటిలాగే ప్రజలకు సేవలు అందిస్తామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరి మృతి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలోని రెండు గ్రామాల్లో వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు మృతిచెందారు. పోలీసు కథనం మేరకు.. పుదూరు పంచాయతీ అత్తిపాళెంకు చెందిన పోట్టేలు వెంకటేష్(34) రెండు రోజుల క్రితం భార్య పల్లవితో గొడవ పడి కొట్టాడు. కోపంతో ఆమె, అతని తల్లి బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటేష్ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు గమనించి 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ అతను మృతిచెందినట్టు పోలీసులకు బుధవారం సమాచారం అందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా కాపులూరుకు చెందిన సన్నారెడ్డి వెంకటమ్మ(78)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో ఆమె 8వ తేదీన ఇంట్లో ఉన్న విషం తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను నెల్లూరులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బుధవారం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందింది. పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలి కుమారుడు సన్నారెడ్డి జనార్దన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో ప్రబలుతున్న అంటురోగాలు



తనియాలి నడి బొడ్డున రోడ్డుకు ఇరు పక్కల నిలిచి ఉన్న వర్షపు నీరు

దొరవారిసత్రం : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం కొరవడింది. దీనికితోడు అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో వీధులు, రోడ్లపై అపరిశుభ్ర వాతవరణం నెలకొంది. దీంతో దోమలు వృద్ధిచెంది స్వైర విహారం చేస్తున్నాయి. అంటురోగాలు ప్రబలుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా తనియాలి, కట్టువాపల్లి, వేణుంబాకం, కల్లూరు, పోలిరెడ్డిపాళెం, కొత్తపల్లి, తుంగమడుగు తదితర గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గ్రామాల్లోని రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఇళ్ల మధ్యలోనే పేడ దిబ్బలు ఉండడంతో దుర్గంధ వెదజల్లుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయకుండా పంచాయతీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్య, సచివాలయం సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదనే వాపోతున్నారు. దీంతో జ్వరాలు, అంటురోగాలు ప్రబలి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆప్కో మేనేజర్‌కు ఘన సన్మానం



ఆప్కో మేనేజర్ దిలీప్‌కుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న కురుగొండ గ్రామస్తులు

ఓజిలి: మండలంలోని కురుగొండ గ్రామ చెరువు కట్టను సొంత నిధులతో మరమ్మతులు చేసిన ఆప్కో మేనేజర్ దిలీప్‌కుమార్‌సింగ్‌ను బుధవారం గ్రామస్తులు శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు. ముందుగా చెరువుకట్ట వద్ద కణికలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు పెట్టారు. ఇందులో ఆప్కో ప్రతినిధులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాకాలంలో చెరువుకట్ట తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. మరమ్మతులు చేయాలని ఆప్కో సంస్థ యాజమాన్యాన్ని కోరామని తెలిపారు. వారు స్పందించి 1.8 కిలోమీటర్లున్న కట్టకు గ్రావెల్ తోలి పటిష్టం చేశారని వెల్లడించారు. తమ గ్రామానికి అండగా నిలిచిన ఆప్కో సంస్థ ప్రతినిధులకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముమ్మారెడ్డి రవీంద్రరెడ్డి, గెడి శ్రీధర్‌రెడ్డి, శివారెడ్డి, గెడి శ్రీనివాసులురెడ్డి, వేణురెడ్డి, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు ఘటనను మరువలేకున్నాం



కరపత్రాలను విడుదల చేస్తున్న యునైటెడ్ ఫోరం నాయకులు

గూడూరు రూరల్ : కారంచేడులో దళితులపై జరిగి దారుణ ఘటన జరిగి 39 సంవత్సరాలు అవుతున్నా నేటికీ మరువలేకున్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం నాయకులు తెలిపారు. వారు బుధవారం గూడూరులోని తమ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు రవి రాఘవేంద్ర అధ్యక్షతన సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కారంచేడులో దళితులపై జరిగిన దారుణాన్ని పురస్కరించుకుని ఈనెల 17న కోటలో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం కర పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడు విజయకుమార్, సభ్యులు సుందరం, మాదవ్, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, సాంబమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేచీరాజ్‌పై దాడి హేయం

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్‌సీపీ కార్యకర్త పేచీరాజ్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. న్యాయం జరగకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. దాడి ఘటనను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పేచీ రాజ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

నేడు పీఎం కిసాన్‌పై సమావేశం

దొరవారిసత్రం: స్థానిక ఏవో కార్యాలయంలో గురువారం పీఎం కిసాన్ యోజన పథకానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏవో జ్యోతిర్మయి తెలిపారు. ప్రతి ఏటా కిసాన్ యోజన పథకం కింద రైతులకు రూ.6 వేలు అందుతుందన్నారు. పీఎం కిసాన్ యోజన పడదని రైతులు ఆధార్, 1బీ, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నంబరుతో రావాలని వివరించారు.

దుకాణదారులకు నోటీసులు

కోట: కోట మెయిన్ రోడ్డులోని పంచాయతీ గదుల్లో దుకాణాలు నిర్వహిస్తున్న 25 మంది వ్యాపారులకు నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ దుకాణాలతో పోలిస్తే పంచాయతీ దుకాణాలకు అద్దె చాలా తక్కువగా ఉందన్నారు. ఈ క్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాలు తీసుకుని అద్దె పెంచాలని తీర్మానించినట్టు వివరించారు. ఒక్కో దుకాణానికి అద్దె రూ.40 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. వ్యాపారులు సహకరించాలని కోరారు. అద్దె చెల్లించని వారు ఖాళీ చేయాలన్నారు. కొందరు దుకాణదారులు నోటీసులు తీసుకునేందుకు ముందుకు రాకపోవడంతో గోడలకు అతికించినట్లు తెలిపారు.

కార్గో సేవలకు గది కేటాయించాలి

కోట: స్థానిక ఆర్టీసీ బస్టాండులో కార్గో సేవలు అందించేందుకు గది కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ ఉన్న గదిని ఆర్టీసీ సిబ్బంది ఖాళీ చేయించారు. దీంతో కార్గో ఏజెన్సీ నిర్వాహకుడు పాయింట్‌ను దూరంగా ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడికి వెళ్లి వస్తువులను అందజేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని వ్యాపారులు, ప్రజలు చెబుతున్నారు. కార్గో సేవలు పొందేందుకు, లగేజీ కోసం ఎన్‌సీఆర్ నగర్ వద్ద ఉన్న కార్గో పాయింట్‌కు వెళ్లాల్సి రావడంతో అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై ఆర్టీసీ సీటీఎం కిష్టమ్మను వివరణ కోరగా కోట ఆర్టీసీ ప్రాంగణంలోనే కార్గో సేవల కోసం మరో గదిని నిర్మిస్తామని తెలిపారు.

రైతు సేవా కేంద్రాలుగా మార్చండి

గూడూరు రూరల్ : రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చాలని వ్యవసాయశాఖ ఏడీఏ గోపీనాయక్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో గూడూరు, చిల్లకూరు మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ పనిముట్లపై ఆడిట్ జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రూప్ సభ్యులు తీసుకున్న పనిముట్లను గుర్తించాలన్నారు. పీఎం కిసాన్ పథకం కింద ఖాతాల్లో నగదు జమ కాని రైతులు తమ ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు అకౌంట్ పుస్తకం జిరాక్స్ కాపీలను గూడూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం అందజేయాలని సూచించారు. ఏవో రమేష్, టెక్నికల్ ఏవో చెంచురెడ్డి, చిల్లకూరు ఏవో గూడూరు భవాని పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

రాపూరు: మండలంలోని సిద్దవరం గ్రామంలో బుధవారం ఆరోగ్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ లింగమూర్తి మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా ప్రబలుతుందన్నారు. పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా డయేరియాను అరికట్టవచ్చన్నారు. వర్షాకాలం వేడిగా ఉన్న ఆహారం, కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ఓజిలి: ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రవిబాబు తెలిపారు. ఆయన బుధవారం రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై ప్రయాణికులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినా ప్రాణాపాయం ఉండదన్నారు. ఎన్నో రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేని వారే మృతి చెందినట్టు వివరించారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

వెంకటగిరి రూరల్ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జంగాలపల్లి సర్పంచ్ పాలూరు ప్రమీల మాట్లాడుతూ తమ పంచాయతీకి సంబంధించిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలని కోరారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.